క్లుప్తంగా

ప్రకాష్‌కు గద్దర్ జాతీయ సేవా పురస్కారం



కోన ప్రకాష్

దాబాగార్డెన్స్: గద్దర్ జాతీయ సేవా పురస్కారానికి జై భీమ్ కన్వీనర్, అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్ ఎంపికయ్యారు. ఈ నెల 12న అంబేడ్కర్ జిల్లాలో అవార్డు ప్రధానం చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ వెన్నెల గద్దర్ చేతుల మీదుగా పురస్కారం అందజేయనున్నారు. పేద ప్రజలకు విద్య, వైద్యం అందించాలని పరితపించి మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మందికి సేవలందించడమేగాక అనేక మందికి ప్రకాష్ ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించారు. ఉచిత రక్తదాన శిబిరాలు, క్యాన్సర్‌పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 12న డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సమత స్వచ్ఛంద సేవా సమితి పురస్కారం అందజేయనుందని అవార్డు పర్యవేక్షణ కమిటీ సభ్యుడు ఆతవ ఉదయ్ భాస్కర్ తెలిపారు.

విద్యార్థులను మోసగిస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోండి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మహారాణిపేట: ప్రభుత్వ గుర్తింపు లేకుండా విద్యార్థులకు విచ్చలవిడిగా సర్టిఫికెట్లు జారీ చేస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పెందుర్తి సుజాతనగర్‌లోని ఒక సంస్థ ప్రభుత్వ గుర్తింపు లేకుండా తప్పుడు ప్రచారం చేస్తూ విద్యార్థులను మోసం చేస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జగ్గునాయుడు కలెక్టర్‌కు సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సంస్థపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చలికాలం నేస్తాలకు ఉక్కపోత



ఉక్కపోత నుంచి ఉపశమనానికి పేపర్ విసురుతూ గాలి పొందుతున్న నేపాలీ

దాబాగార్డెన్స్: ప్రతి ఏటా శీతాకాలంలో నేపాలీలు విశాఖ వచ్చి ఉన్ని వస్త్రాలు విక్రయిస్తుంటారు. నగర పోలీస్ కమిషనరేట్ ఫుట్‌పాత్ వేదికగా ఈ దుస్తుల విక్రయాలు జరుగుతుంటాయి. వీటి కొనుగోలుకు జిల్లా నలుమూలల నుంచే గాక విజయనగరం, పార్వతీపురం తదితర ప్రాంతాల నుంచి జనం వస్తుంటారు. ఇదిలా ఉండగా.. చలి ప్రభావం తగ్గించేందుకు నేపాలీ వ్యాపారులు విక్రయించే ఉన్ని దుస్తులతో ఇక్కడి వాసులు కొంత ఉపశమనం పొందుతుంటే.. ఆ నేపాలీలు దుస్తులు అమ్ముతూ.. చెమటలు కక్కుతున్నారు. ఇక్కడి వాతావరణం పడకో.. వ్యాపారం సాగకో.. తెలియదు గానీ వందల కిలోమీటర్ల దూరం నుంచి ఇక్కడికి వచ్చి.. ఉన్ని దుస్తులు విక్రయిస్తున్న నేపాలీలు ఉక్కపోతకు గురవుతున్నారు. ఓ నేపాలీ సోమవారం ఉదయం 7 గంటలకే తన దుకాణాలు సర్దుకుంటూ ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరవుతూ చేతిలో ఉన్న పేపర్ విసురుతూ గాలిని పొందుతూ ఉపశమనం పొందాడు.

మందుబాబులకు జైలు శిక్ష

మద్రిపాలెం: కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి న్యాయస్థానం జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్టు ట్రాఫిక్ పోలీసులు సోమవారం పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో ఏడుగురు మద్యం తాగి పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారని తెలిపారు. వారిలో ఐదుగురికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించగా, ఇద్దరికి 12 రోజుల జైలు శిక్ష న్యాయమూర్తి విధించినట్టు తెలిపారు.

అంతులేని నిరీక్షణ

సమయానికి రాని ఆర్టీసీ బస్సులు

విద్యార్థులు, ఉద్యోగులకు ఇక్కట్లు



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు, ప్రయాణికులు



కిక్కిరిసిన బస్సులో విద్యార్థులు

దాబాగార్డెన్స్: విశాఖ మహా నగరంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలు, షాపింగ్ మాల్స్, విద్యాలయాలు, కళాశాలలకు వెళ్లేందుకు ఉద్యోగులు, విద్యార్థులు, కూలీలు ఎంతో విలువైన సమయాన్ని వృథా చేయాల్సి వస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రాకపోకలు సాగించే వీరికి సమయానికి ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. షాపింగ్ మాల్స్, దుకాణాల్లో పనిచేసే వారైతే రాత్రి 9, 10 గంటలకు ఇళ్లకు వెళ్తుంటారు. ఆ సమయంలో అందుబాటులో బస్సుల్లేక అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ యాజమాన్యం మాత్రం ఇటు విద్యార్థులు.. అటు ఉద్యోగ, కూలీల కోసం సక్రమంగా బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రద్దీ వేళల్లో బస్సులు నడిపితే...

ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉంటున్నందున ఆ సమయంలో బస్సులు ఎక్కువగా నడపాలని పలువురు కోరుతున్నారు. ఉదయం



కాన్వెంట్ జంక్షన్ వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తున్న పారిశ్రామిక ప్రాంత ఉద్యోగులు

పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేటప్పుడు, సాయంత్రం కళాశాలల నుంచి ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు బస్సులు ఎక్కువగా నడిపితే ఇబ్బందుల నుంచి గట్టెక్కుతామని పలువురు విద్యార్థులు అంటున్నారు. ఆ దిశగా ఆర్టీసీ యాజమాన్యం చర్యలు చేపడితే సంస్థకు లాభాలతోపాటు నగరవాసుల ప్రయాణం సుఖమయం అవుతుంది.

కిక్కిరిసిన బస్సులే దిక్కు..

నగరంలో వందలాది స్కూల్స్, అధిక సంఖ్యలో కళాశాలలు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు కోచింగ్ సెంటర్స్ విస్తృతంగా వెలిశాయి. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు, పరిశ్రమలు నగరంలో విపరీతంగా ఉన్నాయి. స్కూల్స్‌కి వెళ్లాలన్నా.. కళాశాలలకు చేరుకోవాలన్నా.. కోచింగ్ సెంటర్స్‌కు పోవాలన్నా.. ఉద్యోగాలకు వెళ్లాలన్నా అధిక శాతం మంది ఆర్టీసీ బస్సులనే ఆశ్రయిస్తుంటారు. వీరి రాకపోకలు ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడి ఉంటాయి. ఉదయం 9 గంటలకు స్కూల్స్ ప్రారంభమవుతాయంటే కనీసం గంట.. గంటున్నర ముందుగానే బస్టాప్‌కు చేరుకోవాల్సి వస్తోంది. ఆర్టీసీ బస్సులు సమయానికి రాకపోవడంతో బస్టాప్‌ల వద్ద అధిక సంఖ్యలో విద్యార్థులు వేచి ఉంటూ.. వచ్చిన కొద్ది బస్సుల్లోనే కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. మరికొంతమంది విద్యార్థులు ఫుట్‌పాత్‌పై ప్రయాణించాల్సి వస్తోంది. బస్సులు రద్దీగా ఉండడంతో ఇంకొందరు గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. ఆర్టీసీ బస్సులను నమ్ముకునే కన్నా ఆటోలను ఆశ్రయించడమే మంచిదన్నట్టు అనేక మంది ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా ఓ వైపు ఆర్టీసీకి నష్టం వాటిల్లడమే గాక... సామాన్యులపై ఆర్థిక భారం పెరుగుతోంది.

అధిక బస్సులు నడపాలి



ఆర్టీసీ బస్సులు సక్రమంగా నడపాలి. ముఖ్యంగా పాఠశాల, కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు ఉదయం వేళల్లో బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. అలాగే విద్యార్థులు పాఠశాలలు, కళాశాలల నుంచి తిరిగి ఇంటికి వెళ్లే సమయంలోనూ ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి రద్దీ సమయాల్లో ఎక్కువగా బస్సులు నడిపితే అందరికీ ప్రయోజనకరంగా ఉంటుంది.

–పసగాడ రామలింగేశ్వరరావు, ప్రయాణికుడు

అదానీ గ్రూపు అవినీతిపై దర్యాప్తు చేపట్టాలి



నిరసన ప్రదర్శనలో నినాదాలు చేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు, తదితరులు

సీతమ్మధార: భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అత్యంత ఆప్తమిత్రుడు గౌతమ్ అదానీ కంపెనీల్లో అవినీతి, తప్పిదాలు, కేంద్ర ప్రభుత్వ పాత్రపై, ఇటీవల బయటపడిన బొగ్గు, విద్యుత్ కుంభకోణాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద నిర్వహించిన నిరసనలో పైడిరాజు మాట్లాడారు. అమెరికాలోని కోర్టులో అదానీపై అవినీతి కేసు నమోదైందని, తక్కువ గ్రేడ్ గల బొగ్గును ఎక్కువ నాణ్యత కలిగిన బొగ్గుగా చూపించి ధరలను అమాంతం పెంచి ప్రభుత్వం రంగ సంస్థలకు అమ్మడం వల్ల దేశ ప్రజలపై విద్యుత్ చార్జీల భారం పడిందని మండిపడ్డారు. ప్రధానమంత్రి సహకారంతోనే భారత సౌర విద్యుత్ సంస్థ (సెకి)తో ఒప్పందాలు ఎక్కువ ధరకు చేసుకున్నారని ఆరోపించారు. సంయుక్త పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలని, మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక సంఘటనలపై పార్లమెంట్‌లో చర్చించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు జి.ఎస్.జె.అచ్యుతరావు, ఎస్.కె.రెహమాన్, కె.సత్యాంజనేయ, పి.చంద్రశేఖర్, ఎం.మన్మథరావు, ఆర్.శ్రీనివాసరావు, జి.రాంబాబు, సి.ఎన్.క్షేత్రపాల్, ఎ.దేముడమ్మ, జి.జయ, బి.పుష్పలత, ఎన్.నాగభూషణం, పి.గోవింద్, వై.రాంబాబు, జి.కాసులరెడ్డి, ఎస్.అప్పన్న, ఎ.ఆదినారాయణ సీహెచ్ కాసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. అందుకు ప్రతి ఒక్కరూ తమ వాహనాలను ఒక రోజు విడిచి ప్రజా రవాణాను వినియోగించాలని కోరారు. ఆరిలోవ పెదగదిలిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం ఆమె ప్రజా రవాణా వ్యవస్థ ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య ప్రజలు వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడి ప్రజా రవాణా ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణా ఉపయోగిస్తున్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి బస్సులు, లేదా సైకిళ్లను ఉపయోగించడం వల్ల విశాఖ నగరంలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించవచ్చన్నారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు





విశేష పూజలో కనక మహాలక్ష్మి అమ్మవారు, అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో భక్తులు

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల 8వ రోజు సోమవారం కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని విశేష పూజలు జరిపారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అనంతరం సర్వదర్శనం కల్పించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ జరిపారు. త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు మార్గశిర గురువారాల్లో రూ.7,500, మిగిలిన రోజుల్లో రూ.2,500 చెల్లించాలని ఈవో శోభారాణి తెలిపారు.

మండపంలో వైదిక కార్యక్రమాలు

సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శ్రీచక్ర నవావరణార్చన, లక్ష్మీ హోమం, మార్గశిర మాస విశేష కుంకుమార్చన, అష్టోత్తర కుంకుమార్చన, వేదపారాయణ, సప్తశతీ పారాయణ, మహా విద్యాపారాయణ భక్తిశ్రద్ధలతో జరిపారు. ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు మార్గశిర మాస విశేష కుంకుమార్చన చేశారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు వేదపారాయణ, మహా విద్యాపారాయణ జరిపారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, వేదపండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

22న సినీ గీతాల పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రఘురామారావు తదితరులు

దాబాగార్డెన్స్: సాంస్కృతిక సినీ సంగీత సేవా సంస్థ మెలోడీ క్రియేటర్స్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఈ నెల 22న యువతీ యువకులకు సినీ గీతాల పోటీలు నిర్వహించనున్నట్టు సంస్థ కార్యదర్శి ఎంవీ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం దాబాగార్డెన్స్‌లో గల సంస్థ కార్యాలయంలో ప్రముఖ వైద్యుడు, విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 15 నుంచి 25 ఏళ్ల లోపు వయసు గల యువతీ యువకులకు సెమీ క్లాసికల్ సినీ గీతాల పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. పోటీలో పాల్గొనదలచే వారు ఈ నెల 15లోగా సంస్థ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణను 92466 22563లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేత వామనమూర్తి

సీతమ్మధార: ఆటో డ్రైవర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ జంక్షన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఆటో డ్రైవర్లపై ఆర్థిక భారాలు వేసే 21, 31 జీవోలు రద్దు చేస్తామని, భారీగా పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గిస్తామని, డ్రైవర్లకు వాహనమిత్ర పథకం ద్వారా రూ.15 వేల అమలు చేస్తూ పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చి ఆరు నెలలు గడిచినా.. ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. ఆటో డ్రైవర్లను వడ్డీ పేరుతో నిలువు దోపిడీ చేస్తున్న ప్రైవేట్ ఇన్సురెన్స్ కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆటో డ్రైవర్లకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆటో డ్రైవర్ల పిల్లలకు విద్యా, వైద్యంలో 50 శాతం రాయితీ కల్పించి పేద ఆటో డ్రైవర్ల కుటుంబాలు ఆదుకోవాలన్నారు. హామీలు అమలు చేయకుంటే ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో రవికృష్ణ స్టాండ్ అధ్యక్షులు యు.శివాజి, కె.దేముడు, ఈశ్వరరావు, వై.సతీష్, ఎం.భాస్కర్, ఎస్.అప్పలరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభిరుచికి తగ్గట్టు పుస్తకాల ప్రదర్శన



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మహారాణిపేట: పుస్తక ప్రదర్శనల ద్వారా ప్రజల అభిరుచికి తగ్గట్టుగా పుస్తకాలన్నీ ఒకే చోట లభ్యమవుతున్నాయని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. టర్నర్ చౌల్ట్రీ వద్ద ఏర్పాటు చేసిన విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాహితీ వికాసానికి ఎటువంటి లాభాపేక్ష లేకుండా కృషి చేస్తున్న విశాలాంధ్ర నిర్వాహకులను అభినందించారు. ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా నగర ప్రజలు, పుస్తక ప్రియులకు ఒక మంచి వేదిక అవుతుందన్నారు. ఈ నెల 15 వరకు పుస్తక ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం రిటైర్డ్ ఆచార్య చందు సుబ్బారావు, అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అచ్యుతరావు, సీపీఐ నాయకుడు సత్యాంజనేయులు, ఆర్య వైద్య కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లూరు రూప, జనసేన నాయకులు ఎం.శ్రీనివాస్, టర్నర్ చౌల్ట్రీ ఈవో లక్ష్మీప్రసన్న, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆకాశమే హద్దుగా.. రంగులద్దగా...



విశాఖ పోర్టులోని కన్వేయర్ బెల్ట్ రన్‌వే పిల్లర్లకు రంగులద్దేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆకాశమే హద్దుగా ఓ కార్మికుడు ఈ పనులు నిర్వహించాడు. క్రేన్ సహాయంతో 150 అడుగుల ఎత్తులో ఉన్న కన్వేయర్ బెల్ట్ రన్‌వే పిల్లర్లకు రంగులు వేస్తూ సోమవారం ఇలా 'సాక్షి' కంటపడ్డాడు. - దాబాగార్డెన్స్

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న డీఈవో రత్నరాజు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి వైజాగ్‌కు చెందిన భక్తులు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. వైజాగ్ మహారాణిపేటకు చెందిన ములగడ వాణి జానకీ లక్ష్మి కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకునేందుకు సోమవారం ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి రూ.1,00,116ల విరాళాన్ని అందజేయగా, ఆలయ మర్యాదలతో దాతలకు అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం వినతి



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మహారాణిపేట: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, జీవో 77 రద్దు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్(ఏఐఎస్ఎఫ్) విశాఖ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు కోరారు. సోమవారం పలు సమస్యలపై కలెక్టరేట్‌లో కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. అనేక మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ఫీజులు కట్టలేక ఇబ్బందులకు గురవడంతోపాటు డ్రాపౌట్స్ అవుతున్నారని నాగరాజు తెలిపారు. రూ.4,800 కోట్ల పైచిలుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణం విడుదల చేయాలన్నారు. యువగళం పాదయాత్రలో ఈ నిధులు విడుదల చేస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు విడుదల చేయలేదన్నారు. దీని వల్ల కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఫీజ్ కట్టాలని విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేసి ఇబ్బందులు పెడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు జె.అభిషేక్, ఎ.పవన్ కల్యాణ్, కె.శివరాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్షేమంగా భర్త చెంతకు..



భర్త బాషాకు షేక్ సమీని అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి వాసు

సీతమ్మధార: మానసిక వ్యాధితో బాధపడుతున్న తన భార్య కోలుకుని తిరిగి మామూలు మనిషి అయినందుకు భర్త చాలా సంతోషించాడు. వివరాలిలా.. కాకినాడ దగ్గర పెద్ద మామిడాడ గ్రామానికి చెందిన షేక్ సమీ, బాషా దంపతులకు కూతురు, కొడుకు ఉన్నారు. కుమార్తె ప్రేమ వివాహం చేసుకుని వెళ్లిపోయిందని తట్టుకోలేక తల్లి మతిస్థిమితం కోల్పోయింది. ఈ నేపథ్యంలో తన భర్త షేక్ బాషాపై ఆమె దాడి చేసి విశాఖ వచ్చేసింది. ఏయూటీడీ సిబ్బంది గత సెప్టెంబర్‌లో రైల్వే స్టేషన్‌లో రెస్క్యూ ద్వారా సమీని పట్టుకున్నారు. మూడు నెలలపాటు చినవాల్తేరులోని మెంటల్ కేర్ ఆస్పత్రిలో చికిత్స చేయించడం వల్ల ఆమె పూర్తిగా కోలుకుంది. భర్త వివరాలు చెప్పడంతో ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ–ఏయూటీడీ షెల్టర్‌కు అతడిని రప్పించారు. సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు సమక్షంలో సోమవారం ఆమెను భర్తకు క్షేమంగా అప్పగించారు. కార్యక్రమంలో వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి, కేర్‌టేకర్లు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని కార్మికుల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రైవేట్ ఆస్పత్రి ఉద్యోగులు, కార్మికులు

మహారాణిపేట: ఎంజీఎం సెవెన్ హిల్స్ ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పలువురు ఉద్యోగులు కోరారు. విశాఖ జిల్లా హాస్పిటల్, నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. ఆస్పత్రిలో తొలగించిన కార్మికులకు న్యాయం చేయాలని, యాజమాన్యంపై కార్మిక శాఖ చర్యలు తీసుకోవాలని, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని యూనియన్ నాయకులు కోరారు.

ముస్లింల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ముస్లింల ప్రదర్శన

మహారాణిపేట: నూర్ బాష ముస్లింల శ్మశాన వాటికలను నిధులు కేటాయించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని నూరు బాషా ముస్లిం కమిటీ అధ్యక్షుడు షేక్ నాగూర్ (బంక్) కోరారు. శ్మశాన వాటిక లేని చోట స్థలాలు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట విశాఖ నూర్ బాష ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. మదర్సా స్కూలుకు ఉర్దూ టీచర్లను కేటాయించాలని, ఆరిలోవ, పెందుర్తి, తగరపువలసలో మేకలు కమేల ఏర్పాటు చేయాలి కోరారు. పలు సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని, రంజాన్, బక్రీదుల సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడానికి స్థలం కేటాయించాలని ఆయన కోరారు. షేక్ బ్రూహాన్, షేక్ బాబ్జీ, షేక్ బురాన్, నాగూర్, రెహ్మాన్, షేక్ పీరు, హుస్సేన్, బాష, మదీనా పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు బ్రేక్

మళ్లీ 18 నుంచి నిర్వహణ

సీతమ్మధార: ప్రజల సమస్యలు, భూ వివాదాల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులకు బ్రేక్ పడింది. ఈ నెల 6 నుంచి రాష్ట్రంలో రెవెన్యూ సదస్సులు ప్రారంభించడం తెలిసిందే. ఇందులో భాగంగానే విశాఖ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం పరిధిలో ప్రారంభించిన రెవెన్యూ సదస్సులు ఆగిపోవడం గమనార్హం. సీతమ్మధార మండల పరిధిలో వాస్తవానికి డిసెంబర్ 20 వరకు నిర్ణీత వేదికల్లో సదస్సులు జరగాల్సి ఉంది. ఈ నెల 6న రేసపువానిపాలెం రెవెన్యూ విలేజీ ప్రాంత ప్రజలకు సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. ఈ నెల 9న మద్దిలపాలెం ప్రాంత ప్రజలకు 109 నంబర్ సచివాలయం, 11న పెదవాల్తేరు ప్రాంత ప్రజలకు 99 నంబర్ సచివాలయం, 13న చినవాల్తేరు ప్రజలకు ఎంవీపీ కాలనీ లుంబినీ పార్కు ఏరియాలోని కల్యాణ మండపం, 16న వెంకోజీపాలెం ప్రాంత ప్రజలకు ఎంవీపీ కాలనీ నేతాజీ పార్కులోని 105 నంబర్ సచివాలయంలో, 18న దొండపర్తి ప్రాంత ప్రజలకు అక్కయ్యపాలెం షాదీఖానాలో, 20న అల్లిపురం ఎక్స్‌టెన్షన్ వార్డు ప్రాంత ప్రజలకు అక్కయ్యపాలెం షాదీఖానాలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ ఎం.రమేష్ ప్రకటించడం తెలిసిందే. సోమవారం నాటి సదస్సు జరగలేదు. కాగా.. ఈ సదస్సులు ఈ నెల 18, 20 తేదీల్లో దొండపర్తి, అల్లిపురం రెవెన్యూ గ్రామాలకు ఉత్తర నియోజకవర్గంలోని అక్కయ్యపాలెం షాదీఖానాలో ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని తహసీల్దార్ రమేష్ సోమవారం 'సాక్షి'కి తెలిపారు.